క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. జ్యోతిబాగ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. జోరాబీ దర్గా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్ల ఉదయం 11 నుంచి 12 గంటల వరకు. చంద్ర హాట్స్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

రేపు జాబ్ మేళా

గోల్కొండ: 17న తేదీ శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని గోల్కొండ ట్రైల్ బ్లేజర్ కమ్యూనిటీ ల్యాబ్ వారు తెలిపారు. బుధవారం ఓ ప్రకటనలో జాబ్ మేళా వివరాలను గోల్కొండ బంజారు దర్వాజ వద్ద వెల్లడించారు. ఎస్ఎస్‌సీ, డిగ్రీ, పీజీతో పాటు, ఐటీఐ, బీటెక్ పూర్తి చేసిన 18–40 ఏళ్ల గల వారు ఈ జాబ్‌మేళా హాజరుకావచ్చని తెలిపారు. గోల్కొండ బంజార దర్వాజ దగ్గర గల అంబేడ్కర్ కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ జాబ్ మేళా ఉంటుందని వారు తెలిపారు. వివరాలకు 9959061461, 8693266009 లలో సంప్రదించవచ్చు.

నియామకం


భీశ్వ సురేఖ ఓంప్రకాష్

అబిడ్స్: జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా గన్‌ఫౌండ్రీ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ భీశ్వ సురేఖ ఓంప్రకాష్‌ను నియమిస్తూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భీశ్వ సురేఖ ఓంప్రకాష్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ నలుమూలలా ప్రజా సమస్యలపై కౌన్సిల్‌లో ప్రభుత్వాన్ని నిలదీస్తానన్నారు. బీఆర్ఎస్ కేవలం వాగ్దానాలకే పరిమితమైందని ఆరోపించారు. కార్పొరేటర్లకు సరైన నిధులు ఇవ్వకుంటే డివిజన్ ఎలా అభివృద్ధి చెందుతుందని ఆమె ప్రశ్నించారు. గన్‌ఫౌండ్రీ డివిజన్‌ను ఆదర్శంగా డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

ప్రత్యేక పూజలు


సమర్థ నారాయణ మహారాజ్‌కు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జియాగూడ: జియాగూడలోని సమర్థ నారాయణ ఆశ్రమంలో దివంగత 11వ పీఠాధిపతి సమర్థ నారాయణ మహారాజ్ పుణ్యతిథి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం సమర్థ నారాయణ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనగా ఆదిత్య మహారాజ్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

జాతీయ తైక్వాండో పోటీలకు రిఫరీగా శ్రీహరి

గోల్కొండ: పాండిచ్చేరిలో ఈ వారం ముగిసిన జాతీయ సీనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్-2023 పోటీలకు తాళ్లగడ్డకు చెందిన శ్రీహరి కుమార్ యాదవ్ రిఫరీగా విధులు నిర్వహించారు. ఎంతో క్లిష్టమైన ఈ ఆటను సమర్థవంతంగా పని చేసిన శ్రీహరి తైక్వాండో అసోసియేషన్ నుంచి కాకుండా ఇతర రిఫరీల మన్ననలు పొందారు. జాతీయ సీనియర్ పోటీలకు తనను రిఫరీగా ఎంపిక చేసిన తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ వారికి మాస్టర్ ప్రవీణ్‌కుమార్‌కు తానెంతో రుణపడి ఉంటానని ఆయన అన్నారు.

రైతు కుటుంబాల సంక్షేమానికి కృషి చేయాలి


అధికారులతో వ్యవసాయ శాఖ రాష్ట్ర కార్యదర్శి రఘునందన్‌రావు

ఏజీవర్సిటీ: రైతు కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు,వ్యవసాయ అధికారులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రైతు ప్రపంచంలోనే అతిపెద్ద ఆశావాది అని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు అన్నారు.బుధవారం రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్)లో సాంకేతిక శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ శిక్షణలో దాదాపు 90 మంది అధికారులు పాల్గొన్నారు. తెలంగాణలో స్థూల పంటల విస్తీర్ణం పెరిగిందని రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అదించడానికి వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉన్నారని వారి సేవలు రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

జూ చూసొద్దాం రండి

- ఇక ఆన్‌లైన్ బుకింగ్‌తో జూ సందర్శన ఈజీ
- సందర్శకులకు విజ్ఞానంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్న జూ పార్కు


ఎన్‌క్లోజర్‌లో సరదాగా గడుపుతున్న కోతులు


జూ పార్కులోని కొలనులో కొంగలు

చార్మినార్: పాతబస్తీలోని నెహ్రూ జులాజికల్ పార్కును సందర్శించడానికి చిన్నారులతో పాటు పెద్దలు సైతం ఇష్టపడతారు. ప్రస్తుతం జూ సందర్శనకు ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ అందుబాటులోకి వచ్చింది. దీంతో ప్రస్తుతం మనం ఎక్కడి నుంచైనా జూ సందర్శన టికెట్లను ఆన్‌లైన్ ద్వారా ముందుగానే బుక్ చేసుకోవచ్చు. జూ బుకింగ్ కౌంటర్ వద్ద ఉండే చాంతాడంత క్యూలతో ఇబ్బంది పడాల్సిన అవసరం ఇక లేదు. నెహ్రూ జూలాజికల్ పార్కు ఓ ఎంటర్‌టైన్ మెంట్ పార్కుగా కాకుండా సందర్శకులకు ఆహ్లాదం, వినోదంతో పాటు జంతువు, పక్షులపై కొత్త విషయాలను నేర్చుకునే విద్యాలయంగా చెప్పవచ్చు. దీంతో జూ సందర్శకుల రద్దీ కూడా పెరిగింది. అప్పుడప్పుడు వచ్చే పాఠశాలలు, కళాశాలలకు సెలవులతో పాటు వీకెండ్ రోజుల్లో జూపార్కును సందర్శించే సందర్శకుల సంఖ్య అధికంగా ఉంటుంది. కేవలం కాలక్షేపం కోసమే కాకుండా జంతు ప్రపంచం గురించి తెలుసుకునే విజ్ఞాన యాత్రగా జూ పార్కు సందర్శన ఉంటుంది.

జూ సందర్శనకు పెరిగిన ఆసక్తి..

జూలో లేని జంతువు, పక్షులను రప్పించేందుకు, జంతువు, పక్షుల సంతానోత్పత్తి చేపట్టడం ప్రారంభించాక జూ సందర్శన పట్ల సందర్శకుల్లో అమితమైన ఆసక్తి పెరిగింది. అత్యంత విషతుల్యమైన పాములు, విషం లేని పాములను స్నేక్ సెల్ బృందం ప్రదర్శిస్తూ వాటి వివరాలను సందర్శకులకు తెలియజేస్తూ పాముల పట్ల సందర్శకులకు ఉన్న అపోహలను తొలగిస్తున్నారు. ఇదే కాకుండా వన్య ప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ వన్యప్రాణులను దత్తత తీసుకునే వెసులుబాటును కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లపై సందర్శకులను చైతన్యవంతులను చేస్తూ ప్లాస్టిక్ నివారణకు కృషి చేస్తున్నారు. సందర్శకులు రోజంతా ఉపశమనం పొందడమే కాకుండా ఆహ్లాదకరమైన చల్లని వాతావరణాన్ని ఆస్వాదిస్తూ వన్య ప్రాణులను తిలకించడమే కాకుండా అనేక విషయాలను తెలుసుకోవడం లాంటి అనుభూతులను జూను సందర్శిస్తే కాని తెలియదు.

జూపార్కులో సౌకర్యాలు..

జూపార్కును అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతరించిపోయే జంతువు, పక్షుల సంతానోత్పత్తిని చేపట్టేందుకు జూపార్కు కేంద్రబిందువుగా ఉంది. చిన్నారులు ఆడుకునేందుకు చిల్డ్రన్స్ పార్కు, సేద తీరేందుకు పచ్చిక బయళ్లు, రచ్చబండలు, సహపంక్తి భోజనాలు చేసేందుకు పచ్చని తోరణాలతో విచ్చుకున్న పచ్చదనం జూపార్కు అందచందాలను తిలకించేందుకు విజిటర్ వ్యాన్, లయన్ సఫారీ, చిట్టి రైలు అందుబాటులో ఉన్నాయి.

వాటర్ బోర్డులో పాత బకాయిలు ఇప్పించండి


హోంమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మెట్రో వాటర్ బోర్డులో కాంట్రాక్టర్ల పాత బకాయిలు ఇప్పించాలని హోం మంత్రి మహమూద్ అలీకి కాంట్రాక్టర్ల తెలంగాణ జేఏసీ, మీడియా సెల్ ఇన్‌చార్జ్ పోల్కం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. వాటర్ బోర్డు ఎండీ దానకిశోర్ కాంట్రాక్టర్లకు పాత బకాయిలు ఇవ్వడం లేదని, తమను వేధిస్తున్నారని హోం మంత్రికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి మహమూద్ అలీ సానుకూలంగా స్పందించారు. వెంటనే పాత బకాయిలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కార్వాన్ మర్చంట్ అసోసియేషన్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన అన్నారు. కార్వాన్ మర్చంట్ అసోసియేషన్ వారు బుధవారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలుసుకుని సన్మానించారు. ఈ సందర్భంగా వారు కార్వాన్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని విన్నవించాన్నారు. కార్వాన్ మెయిన్ రోడ్డుపై కొన్ని రోజులుగా డ్రైనేజీ ప్రవహిస్తుందని, దీంతో రోడ్డు కూడా దెబ్బతిందని వారు ఆయనకు వివరించారు. రోడ్డు పక్కన ఉన్న షాపులవారు రోడ్డుపై మురుగుతో ఎన్నో ఇబ్బందులుపడుతున్నారని, రోడ్డుపై మురుగుతో తమ వ్యాపారాలు తగ్గాయని ఆయన వారితో వివరించారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే మురుగు పరుగుకు చెక్ పెట్టేందుకు జలమండలి అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ పనులు పూర్తికాగానే రోడ్డు పనులు కూడా ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు దిగంబర్ గులేకర్, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, రాజేష్ పాండ్యా, రామా గులేకర్ తదితరులున్నారు.

సంత్ సేవాలాల్ మహరాజ్ సేవలు ఎనలేనివి


కార్యక్రమంలో పాల్గొన్న బలరామ్ తదితరులు


సేవాలాల్ జయంతి వేడుకలో కుమార్ చౌదరి

గన్‌ఫౌండ్రీ: సంత్ సేవాలాల్ మహరాజ్ సేవలు ఎనలేనివని ఐఆర్ఎస్ అధికారి ఎస్.బలరామ్ అన్నారు. బుధవారం నిజాం కళాశాలలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలను నాటడంతో పాటు ఆయన సందేశాలను బోధించారు. ఈ కార్యక్రమంలో నిజాం షుగర్స్ ఎండీ మాలోతు బద్రి, ఓయూ ఓఎస్‌డీ ప్రొఫెసర్ రెడ్యా నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా, వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మిక వేత్త సంత్ సేవాలాల్..

సుల్తాన్‌బజార్: బంజారా, లంబాడాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త, సంఘం సేవకుడు అని సమైఖ్యాంధ్ర పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు గొంటి కుమార్ చౌదరి అన్నారు. ఈ మేరకు బుధవారం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా బషీర్‌బాగ్ నుంచి బంజారాహిల్స్‌లోని బంజారా భవన్ వరకు నిర్వహించిన ర్యాలీలో కుమార్ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారాహిల్స్‌గా పిలవడుతున్న ప్రాంతంలో మూడు దశాబ్దాల క్రితమే సంత్ సేవాలాల్ నడయాడారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారమని శ్రీశైలం యాదవ్, బీజేపీ హైదరాబాద్ నగర కమిటీ సభ్యులు అంతారం శాంతి కుమార్, హరీష్ యాదవ్, విక్రమ్ యాదవ్, ఉమేష్, ఈదులకంటి రాజేష్, అల్లం సంగీత, సునీత, గణేష్ నీలం రతన్ కుమార్, అల్లం ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


4వ ఏషియాన్ ఇండియా యూత్ సమ్మిట్ సభ్యులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

చార్మినార్: చార్మినార్‌కు విదేశాల నుంచి వచ్చిన 4వ ఏషియాన్ ఇండియా యూత్ సమ్మిట్ డెలిగేట్ బృందానికి బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి సత్కరించారు. ముందుగా చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం వారిని సత్కరించారు. బీజేపీ చార్మినార్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఉమామహేంద్రతో పాటు చార్మినార్ బీజేపీ కన్వీనర్ సురేందర్, కునాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 7.30 గంటలకు సేవాకాలం, శాంతిపాఠం, ద్వారతోరణ పూజ, మూర్తి కుంభారాధన, సుదర్శన నారసింహ హవనం, పూర్ణాహుతి, బలిహరణం, గోష్ఠి, సాయంత్రం 5.30 గంటలకు పారాయణం, చతుస్థానార్చన, మూర్తి మంత్ర హవనం, గోష్ఠి తదితర పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి కంజర్ల ప్రతాపాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, బస్తీవాసులు, ప్రజలు పాల్గొన్నారు.

మీరాలంమండిలో సద్దుమణిగిన ఉద్రిక్తత

చార్మినార్: మీరాలంమండి కూరగాయల మార్కెట్‌లోని ప్రభుత్వ స్థలంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు ప్రైవేటు వ్యక్తులకు అద్దె చెల్లించాల్సిన అవసరం లేదని చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా కబ్జాకు పాల్పడి ఇతరులు వ్యాపారాలు నిర్వహించుకోవడం కోసం స్థలాన్ని ఇచ్చి నెల నెలా అద్దె వసూలు చేస్తున్న విషయంపై బుధవారం ఉదయం మీరాలంమండిలో కొంతమందికి వాగ్వాదం జరిగింది. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితి అదుపు తప్పుతుందని తెలుసుకున్న ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో పాటు పత్తర్‌గట్టి కార్పొరేటర్ సోహెల్ ఖాద్రీ ఘటన స్థలానికి చేరుకొని అక్కడి వారికి నచ్చ చెప్పారు. అలాగే విషయం తెలిసిన వెంటనే మీర్‌చౌక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఒక వ్యక్తి అక్రమంగా అద్దె వసూలు చేస్తున్న విషయాన్ని ఇతర వ్యాపారులు తన దృష్టికి తెచ్చారన్నారు. ఎవరూ ఎవరికి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వం స్వాధీనం చేసుకునేంత వరకు కూరగాయల వ్యాపారాలు కొనసాగించవచ్చునని ఆయన స్పష్టం చేశారు.

రేపు రాష్ట్రంలోని ఐదు వేల ఆలయాల్లో ప్రత్యేక పూజలు


మాట్లాడుతున్న అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసు దేవశర్మ తదితరులు

సుల్తాన్‌బజార్: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈనెల 17న రాష్ట్రంలోని ఐదు వేల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ధూప, దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసు దేవశర్మ, గ్రేటర్ అధ్యక్షుడు శ్రీరంగం గోపికృష్ణమాచార్యులు తెలిపారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ధార్మిక భావన కలిగి గొప్ప ఆధ్యాత్మిక సీఎం కేసీఆర్ అని, అన్ని రంగాల్లో అపార అనుభవం ఉన్న సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం ఎంతో ప్రగతి సాధిస్తుందన్నారు. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం తరహాలో కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, బాసర సరస్వతి అమ్మవారి ఆలయాలను సైతం పునః నిర్మాణం చేపట్టేందుకు వేల కోట్ల నిధులు కేటాయించడంతో పాటు పురోహితుల సంక్షేమం, అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎ.ప్రసాద్‌శర్మ, ఏ.ఫణికుమార్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భర్గవచార్యులు, కోశాధికారి నందనం హరికిషన్‌శర్మ పాల్గొన్నారు.

ముగిసిన ఎగ్జిబిషన్


సందర్శకులతో కిక్కిరిసిన ఎగ్జిబిషన్

అబిడ్స్: 82వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనశాల (నుమాయిష్) చివరి రోజు బుధవారం సందర్శకులతో కిక్కిరిసి పోయింది. సందర్శకులు కొనుగోలు చేయడంతో స్టాళ్లు అన్ని సందడిగా మారాయి. బుధవారం ఒక్కరోజే దాదాపు లక్ష మంది ఎగ్జిబిషన్‌ను సందర్శించారని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు అశ్విని మార్గం తెలిపారు. 46 రోజుల పాటు కొనసాగిన ఎగ్జిబిషన్‌లో 22 లక్షల మంది సందర్శకులు సందర్శించారని ఆయన వివరించారు. ఈ దఫా దేశంలోని పలు రాష్ట్రాల స్టాళ్లతో పాటు ప్రభుత్వానికి చెందిన పలు విభాగాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌ను చివరి రోజు సందర్శించేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు తరలి రావడంతో ఎగ్జిబిషన్ పరిసర ప్రాంతాలన్ని జనసంద్రంగా మారాయి.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించాలి



కార్యక్రమంలో పాల్గొన్న అనిల్ బన్సాలి తదితరులు

గన్‌ఫౌండ్రీ: పిల్లల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించాలని గూగుల్ సంస్థ ఉపాధ్యక్షుడు అనిల్ బన్సాలి అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో బ్రైట్ స్టార్ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు ఆంగ్ల, వ్యక్తిత్వ నైపుణ్యాలు, ఆత్మ విశ్వాసంతో పాటు నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడుతాయని తెలిపారు. సంస్థ సీఈఓ శ్రీనివాసన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 250 మంది విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గోల్కొండ: సమస్యల పరిష్కారానికి తమ సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని జలమండలి జనరల్ మేనేజర్ నాగేందర్ అన్నారు. స్థానిక బీజేపీ నాయకులు, న్యూ సత్యనారాయణనగర్ వాసుల విజ్ఞప్తి మేరకు ఆయన బుధవారం గుడిమల్కాపూర్ డివిజన్‌లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌తో పాటు పలువురు తమ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నారని, వారి ఫిర్యాదులను వెంటనే సమస్య ఉన్న ప్రదేశానికి అధికారిని పంపి పరిష్కరిస్తున్నానన్నారు. బీజేపీ నాయకులు డిజ్వర్ సింగ్‌తో పాటు ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

మే నెలలో మాలల బహిరంగ సభ


సమావేశంలో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, చెన్నయ్య తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో 90శాతం ఉన్న బహుజనలకు సీఎం పీఠం దక్కాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో మాల మహానాడు రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అధికశాతం ఉన్న బడుగు, బలహీన వర్గాలకు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేశారని విమర్శంచారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు భవనానికి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ పేరు పెట్టాలని కోరారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. మే నెలలో మాలల బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మాలలు తమ ఓటు బ్యాంకుతో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు బండ్ల శ్రీనివాస్, విశ్వనాథ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జాంబాగ్‌లో 'హాత్ సే హాత్ జోడో'


హాత్ సే హాత్ జోడోలో పాల్గొన్న మాజీ మంత్రి పుష్పలీల, మెట్టు సాయికుమార్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం జాంబాగ్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి పుష్పలీల, రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్‌తోనే ప్రగతి, అభివృద్ధి సాధ్యమని వివరించారు. బీజేపీ, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని వారన్నారు. కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, జితేందర్, కృష్ణయాదవ్, జగపతి శేఖర్, సైని శ్రీనివాస్, దొడ్డుల సందీప్, తరుణ్, నర్సింగ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

గ్యాంగ్‌వార్‌కు దారి తీసిన అంత్యక్రియల గొడవ

ఇరువర్గాలకు గాయాలు, ఇద్దరి పరిస్థితి విషయం

లంగర్‌హౌస్: అంత్యక్రియల సమయంలో జరిగిన గొడవ గ్యాంగ్‌వార్‌కు దారి తీసిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శివకుమార్, వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్‌కు చెందిన విజయ్‌సింగ్ కూతురు మంగళ్‌హాట్‌లో నివసిస్తుండగా ఆమె అత్త లడ్డో (55) ఈ నెల 12న మృతిచెందింది. ఆమె అంత్యక్రియల్లో పాల్గొనడానికి విజయ్‌సింగ్ బంధుమిత్రులతో వెళ్లారు. శ్మశానవాటికలో అంత్యక్రియలు సక్రమంగా నిర్వహించే విషయంలో శ్మశానవాటిక నిర్వాహకులతో పాటు మేతర్ల సంఘం వారికి గొడవ జరిగింది. ఈ సమయంలో గొడవ వద్దని విజయ్‌సింగ్ బంధువులు నచ్చజెప్పేప్రయత్నం చేశారు. వీరి కుటుంబాల్లో అందరికీ బంధువుల పరిచయాలు అంతగా లేకపోవడంతో ఎవరి తరుపున ఎవరు మాట్లాడుతున్నారో తెలియక లడ్డో కుటుంబీకులు లంగర్‌హౌస్‌కు చెందిన పలువురితో గొడవపడ్డారు. మూడు రోజుల దినకర్మ సందర్భంగా మృతురాలి అస్థికలు నిమజ్జనం చేయడానికి లంగర్‌హౌస్ బాపుఘాట్‌కు వచ్చారు. విజయ్‌సింగ్ బంధువులు కూడా అక్కడకు చేరుకున్నారు. అనంతరం మంగళ్‌హాట్‌కు చెందిన కుర్నల్, లంగర్‌హౌస్‌కు చెందిన మహేందర్‌సింగ్ అంత్యక్రియల రోజు జరిగిన గొడవ విషయం చర్చిస్తుండగా మళ్లీ గొడవ జరిగింది. అప్పటికే పక్క వీధిలో వేచిఉన్న దాదాపు 40 మంది కర్రలు, రాళ్లు బాటిళ్లతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ రోడ్లపై పరుగులు తీశారు. ఈ గొడవల్లో విజయ్‌సింగ్‌తో పాటు లంగర్‌హౌస్‌కు చెందిన 8 మంది, మృతురాలి పెద్దకుమారుడి కొడుకు నితిన్‌కు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ విజయ్‌సింగ్, మహేందర్‌సింగ్‌ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధన్యవాదాలు


అబ్దుల్ నజీర్‌ను కలిసిన మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ (ఫైల్)

చార్మినార్: మాజీ సుప్రీంకోర్టు జడ్జి అబ్దుల్ నజీర్‌ను ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా నియమించిన ప్రధాని నరేంద్ర మోదీకి ముస్లిం మైనార్టీ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు బీజేపీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. ముస్లిం మైనార్టీ ప్రజలకు అన్ని విధాలుగా బీజేపీ ప్రభుత్వం అండదండగా ఉంటుందనడానికి ఏపీ గవర్నర్‌గా అబ్దుల్ నజీర్‌ను నియమించడమే ఒక నిదర్శనమన్నారు.

బోజగుట్టలో 'ఆయుష్మాన్ భారత్'


ఆయుష్మాన్ భారత్ కార్డు నమోదు చేసుకుంటున్న అభ్యర్థులు

గోల్కొండ: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం సంజీవని లాంటిదని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ డివిజన్‌లోని బోజగుట్ట శివాజీనగర్‌లో ఆయుష్మాన్ భారత్ కార్డు నమోదు కార్యక్రమం జరిగింది. ఈకేవైసీ వారి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆహార భద్రత కార్డు ఉన్న వారికి ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం వరంలాంటిదని, వైద్యం కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్డు ఉన్న వారికి రూ.5 లక్షలు వైద్య పరీక్షలు భరిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర వంశీ, బాలస్వామి, అశ్విన్, వెంకటేశ్‌సాగర్, ప్రసాద్ తదితరులున్నారు.

19న ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్ర

రాజేంద్రనగర్: ఛత్రపతి శివాజీ మహరాజ్ యువ సమితి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభయాత్రను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. శోభయాత్రలో పాల్గొనాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా వెళ్లి ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర ఈ నెల 19న వేడుక నిర్వహిస్తామన్నారు.